ఇండ్ల మధ్య.. కంచె లేకుండా

మండలంలోని నర్సింహుపల్లిలో పోలం ఓదెలు ఇంటి ప్రహరీని ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. కొన్నేళ్ల క్రితం వ్యవసాయ పంప్ సెట్ల కోసం ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి ఎల్‌టీ లైన్‌కు కనెక్షన్ ఇచ్చారు. ఈ ట్రాన్స్ ఫార్మర్ మీదుగా విద్యుత్తు వైర్లు ఎక్కువ సంఖ్యలో ఉండగా గాలి దుమారానికి, ఈదురు గాలులకు ఒకదానికి ఒకటి తాకి మంటలు లేస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నా రు. రక్షణగా కంచె ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఖిలావనపర్తి ట్రాన్స్‌కో ఏఈఈ సురేశ్‌ను వివరణ కోరగా అంచనా తయారు చేయించి ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటుతో పాటు వదులు తీగెలను సరి చేయించడం, మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

-ధర్మారం,జూలై 7

అధ్వాన్నపు రోడ్డుతో అవస్థలు

ఓదెల, జూలై 7: పొత్కపల్లిలోని ప్రధాన రోడ్డు గుంతలు పడి అధ్వాన్నంగా మారడంతో గ్రామస్తులతో పాటు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సుల్తానాబాద్– జమ్మికుంట ప్రధాన రహదారిలో పొత్కపల్లిలో రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులతో పాటు రోడ్డు పక్కన ఇండ్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మడక గ్రామం నుంచి గుంపుల వరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీఆర్ఎఫ్ నిధులు రూ. 16 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. కాగా రహదారి మధ్యలో పొత్కపల్లి గ్రామంలో మాత్రం ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారైంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ రోడ్డును బాగు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అడుగడుకో గుంత ఉండి వాహనాలు నడవడం కష్టంగా మారింది. గుంతలలో నీరు నిలిచి దుర్వాసన వస్తున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన

పొత్కపల్లిలో గుంతలతో అధ్వాన్నంగా ఉన్న ప్రధాన రోడ్డు

వ్యక్తం చేస్తున్నారు. మడక నుంచి ఇందుర్తి గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణం పూర్తయినా మార్గ మధ్యలో పొత్కపల్లి గ్రామంలోని రోడ్డును బాగు చేయడం లేదని గ్రామస్తులు నిరసన తెలుపుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పొత్కపల్లి లోని రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

ఐఎన్టీయూసీ కోర్ కమిటీ సమావేశం

గోదావరిఖని, జూలై 7: బొగ్గు బ్లాక్‌ల వేలానికి వ్యతిరేకంగా ఎన్టీయూసీ తీసుకునే కార్యాచరణపై పట్టణంలోని లక్ష్మీనరసింహ గార్డెన్‌లో ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కోర్ కమిటీ సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా యూనియన్ పరంగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. మన బొగ్గు మన –హక్కు నినాదంతో సింగరేణి వ్యాప్తంగా చేపట్టనున్న రణభేరి యాత్ర ప్రారంభం, గనులలో జరుగుతున్న ప్రమాదాల నివారణ కు తీసుకోవాల్సిన సేఫ్టీ, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్‌ను ప్రారంభించి వారి హక్కుల కోసం కృషి చేయడం తదితర అంశాలపై చర్చించారు. ఇక్కడ యూనియన్ సెంట్రల్ వైఎస్ ప్రెసిడెంట్‌లు నరసింహరెడ్డి, సిద్దంశెట్టి రాజమౌళి, ధర్మపురి, జనరల్ సెక్రటరీలు త్యాగరాజన్, ఎడీ అక్రం, సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్ కుమార్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్, మహిళా అధ్యక్షురాలు శేషా రత్నం, జిల్లా అధ్యక్షురాలు దాస్, ఆర్జీ–1,2,3, భూపాలపల్లి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, కొత్తగూడెం, ఇల్లందు, కార్పొరేట్‌ల వైఎస్ ప్రెసిడెంట్లు ఉన్నారు. .

మాజీ ఎంపీపీకి ఆత్మీయ సన్మానం



మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క దంపతులను సన్మానిస్తున్న నాయకులు

రామగిరి, జూలై7: రామయ్యపల్లిలో ఆదివారం తాజా మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ దంపతులను యూత్ సభ్యులు సన్మానించారు. ఐదేళ్ల పదవీ కాలం ముగిసిన సందర్భంగా పూలమాల, శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దాడి కృష్ణ, పెండ్రు ప్రదీప్, రజనీకాంత్, సతీశ్,వడ్లకొండ హరీశ్, మహేశ్, సాయికుమార్ పాల్గొన్నారు.

యాదవ మహాసభ కార్యవర్గం

మంథని, జూలై7 : అఖిల భారత యాదవ మహాసభ మంథని మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం మంథని పట్టణం ఎస్ఎల్బీ గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందేవేన రాజేందర్, జిల్లా కార్యదర్శి ఉడత పర్వతాలు యాదవ్ ఆధ్వర్యంలో యాదవ మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంథని మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడిగా పర్శవేన మోహన్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పేగడ శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులుగా కనగంటి ఓదెలు యాదవ్, వేముల లచ్చన్న యాదవ్, జనరల్ సెక్రటరీగా బాస అశోక్ యాదవ్, జాయింట్ సెక్రటరీగా రాజనవేన సదయ్య యాదవ్, సెక్రటరీగా ఎలవేణి సమ్మయ్య, యూత్ అధ్యక్షుడిగా పీడుగు మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దొరగొర్ల రవీందర్, ఉపాధ్యక్షుడిగా పంచిక హర్ష వర్ధన్, జాయింట్ సెక్రటరీగా బురుగుల రాకేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ దారవే ని నరసింహ యాదవ్, సీనియర్ నాయకుడు తోట్ల తిరుపతి యాదవ్, రాష్ట నాయకుడు పర్శ బక్కన్న యాదవ్, మాజీ సర్పంచ్‌లు కనవెన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మ్ స్ట్రాంగ్‌కు నివాళి

మంథని, జూలై7: బహుజన సమాజ్ పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్ హత్యను బహుజన సమాజ్ పార్టీ మంథని నియోజకవర్గ నాయకులు ఖండించారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో అయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్మ్ స్ట్రాంగ్‌ను కొందరు దుండగులు అత్యంత పాశవికంగా దాడి చేసి హత్య చేయడాన్ని ఖండిసున్నామన్నారు. ఈ హత్యకు పాల్పడిన దోషులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ మంథని నియోజకవర్గ ఇన్‌ఛార్జి జనగామ రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, బహుజన సమాజ్ పార్టీ కాటారం మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు, రామగిరి మండల అధ్యక్షుడు రేణిగుంట్ల మల్లేష్, మల్హార్ రావు మండల అధ్యక్షుడు నక్క మహేష్, వ్యవసాయ శాఖ కార్మిక నాయకుడు ప్రసాద్, నందు, విష్ణు, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో సదరన్ రీజియన్ స్పోర్ట్స్ మీట్

జ్యోతినగర్, జూలై 7: ఎన్టీపీసీ సదరన్ రీజియన్ స్పోర్ట్స్ మీట్ –2024 ఆదివారం రామగుండం ఎన్టీపీసీలో ఘనంగా ప్రారంభమైంది. ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని మహాత్మగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కేధార్ రంజన్‌పాండు క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. సదరన్ రీజియన్ పరిధిలోని రామగుండం ఎన్టీపీసీతోపాటు సింహాద్రి, కుడిగి, ఎన్‌టీఈసీఎల్ వల్లూరు ప్రాజెక్టులకు చెందిన ఉద్యోగ క్రీడాకారులు 100మందికి పైగా పాల్గొన్నారు. ఐదు టీమ్‌లుగా విభజించారు. పురుషుల విభాగంలో క్రికెట్, మహిళా విభాగంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. మొదటి క్రికెట్ మ్యాచ్‌లో రామగుండం ఎన్టీపీసీ జట్టు విజయం సాధించింది. ఇక్కడ ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు చిన్మోయి దాస్, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ సంతోష్ తివారీ, ఎన్టీపీసీ ఎన్‌బీసీ మెంబర్ బాబర్ సలీంపాషా, జీఎంలు, ఉన్నతాధికారులు, గుర్తింపు సంఘం నాయకులు, పీఈటీలు సుదేశ్, విజయ్ ఉన్నారు.

క్రీడాజ్యోతితో రామగుండం ఎన్టీపీసీ ఈడీ

ప్రాథమిక పాఠశాలను హైస్కూల్‌గా మారుస్తా

ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నా : రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

యైటింక్లయిన్ కాలనీ, జూలై 7: ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్న తాను డివిజన్లలో పలు మౌలిక వసతుల రూపకల్పనే ప్రధాన ఎజెండాగా డివిజన్ బాట చేపట్టినట్లు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ తెలిపారు. ఈమేరకు రామగుండం కార్పొరేషన్ 17,18 డివిజన్లలో సింగరేణి, మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. అల్లూరు హనుమాన్ నగర్, సంతోష్‌నగర్‌లో కూరుకుపోయిన నాలాలు, పేరుకుపోయిన చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్ల గురించి, నాళాలలో పేరుకు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

పోయిన చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తీసివేయాలని అన్నారు. పట్టణంలోని ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా త్వరలోనే మారుస్తామని అన్నారు. ఆయన వెంట సింగరేణి, పోలీస్, విద్యుత్, మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

‘పుట్ట’పై విమర్శలు అర్థరహితం

కమాన్‌పూర్, జూలై 7: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై విమర్శలు చేయడం అర్థరహితమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేం ద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుట్ట మధుపై చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటుగా ఉన్నాయన్నారు. నాడు మంథని ఎమ్మెల్యేగా పుట్ట మధు ఉన్నప్పు డు, ఇదే కాంగ్రెస్ నాయకుడు తనకు శ్రీధర్‌బాబు నుంచి ప్రాణహాని ఉందంటూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చాడని గుర్తు చేశారు. అప్పుడు మధు గొప్పవాడని ఊరూరా ప్రచారం చేసిన విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. ఇప్పుడు శ్రీధర్ బాబుకు పదవి రావడంతో మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరి పుట్ట మధు పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏ ఎండకు ఆ గొడుగు పట్టిన చందంగా ఉందన్నారు. పదవులు శాశ్వతం కాదనీ, ప్రజలే అంతిమ న్యాయ నిర్ణేతలు అని గుర్తుంచుకోవాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్‌వై మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, మండల మహిళా అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, సిద్దిపల్లె మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, జూలపల్లి మాజీ ఉప సర్పంచ్ పోలుదాసరి సాయికుమార్, నాయకులు నీలం శ్రీను, రామ్మూర్తి పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

రామగిరి, జూలై 7: లద్నాపూర్ ఓసీపీ–2 సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని రామగిరి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మంథని సీఐ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మండలంలోని నాగెపల్లికి చెందిన కొండవేన అనిల్ తన స్నేహితులు మహాముత్తారం మండలానికి చెందిన కొండపాక రవికిరణ్, జాడి రాజేశ్, మంథని మండలం గోపాల్‌పూర్‌కు చెందిన ఎరుకల భాస్కర్, కాటారం మండలం ధన్వాడకు చెందిన సుతారి శ్రీకాంత్ రెండు ద్విచక్ర వాహనాలపై నాగెపల్లి ఎక్స్ రోడ్డు వైపు గంజాయి విక్రయించేందుకు తీసుకు వెళ్తున్నారు. శనివారం ఓసీపీ–2 వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. వారి వద్ద మూడు కిలోల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. నిందితుల నుంచి రెండు వాహనాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తర లించినట్లు తెలిపారు. నిందితులు తమ అవసరాలు, జల్సాలకు డబ్బులు సరిపోకపవడంతో తొందరగా సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించాలని నిర్ణ యించుకొని ఒడిశా రాష్ట్రంలో కాంతారావు అనే వ్యక్తి వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి గంజాయి తీసుకవచ్చి ఇక్కడ చుట్టు పక్కల గ్రామాల్లో విక్రయిస్తుండేవారని తెలిపారు. గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న రామగిరి ఎస్ఐ సందీప్‌ను అభినందించారు.

ఏడాదిగా కౌన్సిల్ సమావేశాలకు ఎగనామం

కోల్‌సిటీ, జూలై 7: రామగుండం నగర పాలక సంస్థలో దాదాపు ఏడాది కాలంగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా పెండింగ్ అప్రూవల్‌తో కాలం గడిపిస్తున్నారని 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు ఆదివారం ప్రకటన లో ఆరోపించారు. ఆయా డివిజన్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, కావల్సిన నిధులపై చర్చించేందుకు నిర్దేశించిన కౌన్సిల్ సమావేశాలు ప్రతి నెల క్రమం తప్పకుండా నిర్వహించాల్సి ఉందన్నారు. కార్పొరేషన్‌లో దీర్ఘకాలంగా వివిధ శాఖల్లో కొనసాగుతున్న కొంతమంది అధికారుల అవినీతికి అలవాటు పడి కొంతమంది చోటా మోటా నాయకుల మోచేతి నీళ్లు తాగుతున్నారని ఆరోపించారు. కౌన్సిల్ సమావేశాల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోకపోవడంతో డివిజన్లలో అభివృద్ధి పనులు ముందుకు సాగక ప్రజలకు సమాధానం చెప్పుకోలేక తాము ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, కార్పొరేటర్లకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదన్నారు. కొంతమంది నాయకులు ఏకంగా కమిషనర్ అధికారాలను దుర్వినియోగం చేస్తూ ఇష్టారాజ్యంగా అవినీతి పనులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని కౌన్సిల్ సమావేశాలు విధిగా జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

ధర్నాను విజయవంతం చేయండి

జ్యోతినగర్, జూలై 7: ఈ నెల 10న కార్మికుల డిమాండ్ డేను పురస్కరించుకొని రామగుండం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ భిక్షపతి కోరారు. ఆదివారం రామగుండంలోని సీఐటీయూ కార్యాలయంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. దర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఎన్టీపీసీ రామగుండం ఏరియా కన్వీనర్ జీ లక్ష్మారెడ్డి, కోశాధికారి ఎం రామాచారి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గుండు కనకయ్య, రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాదాసి మల్లేశ్, తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్ కాలనీ, జూలై 7: ఈనెల 14వ శ్రీరాంపూర్ ఏరియా నస్పూరు కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో జరగనున్న బీఎంఎస్ 28వ ద్వైవార్షిక మహాసభలను విజయవంతం చేయాలని బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి వై.సారంగపాణ, వర్కింగ్ అపెసిడెంట్ వేణుగోపాల్ రావు కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నూతన బొగ్గు గనుల ఏర్పాటు, కార్మికులకు ఇన్‌కం టాక్స్ రీయింబర్స్‌మెంట్, సొంతింటి పథకం అమలు, ప్రతి రీజియన్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, సింగరేణి వ్యాప్తంగా కేంద్రియ విద్యాలయాల ఏర్పాటు, జనరల్ మజ్దూర్ డిసిగ్నేషన్ మార్పు, కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ క్వార్టర్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి, ముఖ్య నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు రాంచందర్, వెంకటస్వామి, జనార్దన్, సత్తయ్య, లింగం నాయక్ పాల్గొన్నారు.

నిలిచిన ‘పంచాయతీ’ పనులు

బాలరాజ్‌పల్లిలో అసంపూర్తిగా నిలిచిన పంచాయతీ భవనం

- మూడు గ్రామాల్లో అసంపూర్తి భవనాలు
- ఆరుబయట సమావేశాలు
- అప్పులు చేసి నిర్మాణాలు బిల్లులు చెల్లించని సర్కారు

జూలపల్లి, జూలై 7 : మండలంలో గ్రామ పంచాయతీ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తికాపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మూతపడిన ప్రభుత్వ పాఠశాల, ప్రైవేట్ ఇండ్లు కిరాయికి తీసుకుని పంచాయతీ పాలన కొనసాగిస్తున్నారు. గ్రామాభివృద్ధి, పంచాయతీ పాలన తీరును చర్చించడానికి ఆరు బయట సభలు, సమావేశాలు నిర్వహిస్తూ అవస్థలు పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అవస్థలు పడుతున్నారు. పై కప్పులు శిథిలమై వర్షాలకు ఉరుస్తూ పంచాయతీ రికార్డులు భద్రపర్చడం ఇబ్బందిగా మారుతుంది. సొంత భవనాల పనులు నెరవేరక ఇరుకు గదు ల్లో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ సర్కార్ అన్ని సదుపాయాలతో ఒక్కో పంచాయతీ భవనం నిర్మించడానికి ఈజీఎస్ పథకం కింద రూ. 20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో అబ్బాపూర్, బాలరాజ్‌పల్లి, కీచులాటపల్లి గ్రామాల్లో జీపీ భవనాలు నిర్మాణ దశలో కొట్టుమిట్టాడుచున్నాయి. ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపులు లేక గుత్తేదారులు ఆర్థిక కష్టాల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నారు. లక్షల్లో అప్పులు చేసి భవనాలు నిర్మించినా రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని పేర్కొంటున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బిల్లులు చెల్లించి, మిగులు పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

గూడెంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

ఓదెల, జూలై 7: ఓదెల మండలంలోని గూడెం గ్రామంలో మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలను గ్రామస్థులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని మహిళలు ఇంటికో బోనం చొప్పున డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో మల్లికార్జునస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తరలి వెళ్లారు. అక్కడ విగ్రహ ప్రతిష్టను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని బోనం ఎత్తుకున్నారు. ఇక్కడ మాజీ సర్పంచ్ గోవిందుల ఎల్లస్వామి, నాయకులు తదితరులు ఉన్నారు.

ఎల్ఓసీ చెక్కుల అందజేత

కొలనూర్‌కు చెందిన గీట్ల శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో అనారోగ్యంతో చికిత్స చేయించుకోగా, సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2. 25లక్షలు మంజూరయ్యాయి ఎల్ఓసీ చెక్కును ఆదివారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. హరిపురం గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు రూ. 1,10,000 చెక్కును అందించారు. కార్యక్రమంలో నాయకులు బైరి రవిగౌడ్, పాకాల కరుణాకర్‌రెడ్డి, ఎడవెల్లి జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ముత్తారం, జూలై 7: అడవి శ్రీరాంపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1989– 90 బ్యాచ్ పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత ఒకే చోట చేరి తమ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆత్మీయతను చాటుకున్నారు. చిన్ననాటి గురువులు కేదారీ, అయిలయ్య, రాజయ్య, రవిందర్, లక్ష్మి నారయణ లను శాలువా పూలమాలలతో సత్కరించుకున్నారు. ఇక్కడ పూర్వవిద్యార్థులు రమేష్, సంపత్ రావు, రవిందర్ రావు, రాజేశం, ధర్మలత, సుజాత, రమా శ్రీనివాస్, మొగిళి పాల్గొన్నారు.

వైద్య శిబిరం

గోదావరిఖని, జూలై 7: లయన్స్‌క్లబ్ ఆఫ్ రామగుండం, మగువ ఆధ్వర్యంలో 42వ డివిజన్‌లో డయబెటిక్ వైద్య శిబిరం జరిగింది. డివిజన్‌లోని ఊర్వశి టాకీస్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో 50మందికి షుగర్ పరీక్షలు, బ్లడ్ ప్రెషర్ పరీక్షలు నిర్వహించారు. మరిన్ని పరీక్షలకు పలువురిని దవాఖానకు రెఫర్ చేసుకున్నారు. ఇక్కడ డివిజన్ కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్, లయన్స్‌క్లబ్ సెక్రటరీ బీనాసింగ్, కోశాధికారి లయన్ తిరుమల, ఇమిడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ లక్ష్మీవాణి, సీనియర్ సభ్యులు డాక్టర్ వనజ, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ శశికళ, జోన్ పర్సన్ లయన్ రాజేందర్ ఉన్నారు.

లయన్స్ క్లబ్ మగువ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కోల్‌సిటీ, జూలై 7: లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక 42వ డివిజన్ పరిధి ఊర్వశి థియేటర్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 50 మందికి షుగర్, బీపీ నిర్ధరణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. షుగర్ వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లపై వైద్యులచే పలు సూచనలు చేయించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్, క్లబ్ అధ్యక్షురాలు లయన్ సునీత, కార్యదర్శి బీనాసింగ్, కోశాధికారి లయన్ తిరుమల, డా.లక్ష్మీవాణి, సభ్యులు డా.వనజ, శశికళ, జోన్ చైర్మన్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో కలర్ కార్డులను రద్దు చేయాలి

మాట్లాడుతున్ననాయకులు

గోదావరిఖని, జూలై 7: సింగరేణిలో కలర్ కార్డులను రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచీ కార్యదర్శి ఆరెల్లి పోశం డిమాండ్ చేశారు. భాస్కర్‌రావు భవన్‌లో ఆదివారం వారు మాట్లాడారు. కార్మికులు విధుల్లో ఎలాంటి పొరపాట్లు చేయకున్నా సింగరేణి యాజమాన్యం ఎల్లో, రెడ్ కార్డుల జారీ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ముందస్తుగానే యాజమాన్యం ప్రమాదంలో కారకులైన వారికి ఎల్లోకార్డు, మూడుసార్లు కారణమైన వారికి రెడ్ కార్డుతో కార్మికులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనుకానున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం కలర్‌కార్డుల విధాన్ని వెంటనే రద్దు చేయకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. నూతన బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా జీఎం కార్యాలయాల వద్ద రిలే దీక్షలు చేపడుతున్నామని కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాని కోరారు. ఇక్కడ నాయకులు సంకె అశోక్, రంగు శ్రీనివాస్, ఎస్ వెంకట్‌రెడ్డి, గండి ప్రసాద్, మిట్ట శంకర్, దొంత సాయన్న, ఎంఎ గౌస్, సిద్దమల్ల రాజు, మానాల శ్రీనివాస్, పర్లపల్లి రామస్వామి, ఎం సంపత్, తాని రాజబాబు, రవి, ఎల్ రాజకిశోర్, బండారి శ్రీనివాస్, అటికేటి రాజు, దాసరి శ్రీనివాస్, సారయ్య, తొడుపునూరి రమేశ్‌కుమార్ ఉన్నారు.

ఖనిలో ఎస్సీ వర్గీకరణ దినోత్సవం

గోదావరిఖని, జూలై 7: ఎస్సీ వర్గీకరణ పోరాట ఉద్యమం చేపట్టి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం గోదావరిఖనిలో మాదిగ తెలంగాణ హక్కుల దండోర నాయకులు ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగ హక్కుల దండోర రాష్ట్ర ప్రధానకార్యదర్శి కనుకుట్ల సమ్మయ్య, కార్పొరేషన్ అధ్యక్షుడు కుడిదల వెంకటేశ్, జిల్లా అధికారప్రతినిధి ఉప్పులేటి శంకర్, ప్రధానకార్యదర్శి కనుకుంట్ల నారాయణ మాదిగ, తోకల రఘు, ఇందారపు అశోక్, టీ ప్రశాంత్, ఉప్పులేటి సమయ్య ఉన్నారు.

అపోహలు వీడండి.. నేత్రదానం చేయండి

పాలకుర్తి, జూలై7: కన్నాల గ్రామానికిచెందిన అందె లక్ష్మి గత నెల 28న మృతిచెందగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రజలు అపోహలు వీడి, నేత్రదానానికి ముందుకు రావాలని ఫౌండేషన్ సభ్యులు గ్రామస్తులను కోరారు. ఈసందర్భంగా అందెలక్ష్మి కుటుంబ సభ్యులను సన్మానించి, అభినందపత్రం అందజేశారు.

ఎస్ఐ మృతికి కారకులను అరెస్టు చేయాలి

కోల్‌సిటీ, జూలై 7: మహబూబ్‌నగర్‌లో ఎస్ఐ ఆత్మహత్యకు కారకులైన అశ్వారావు పేట సీఐ జితేందర్ రెడ్డి, మరో ఐదుగురు కానిస్టేబుళ్లపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత వర్గానికి చెందిన ఎస్.ఐ శ్రీరాముల శ్రీనును అవమానించి ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే విధుల నుంచి తొలగించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

పీజీ కళాశాలలో కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

ఫర్టిలైజర్‌సిటీ, జూలై 7: గోదావరిఖనిలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఈఏపీసీఈటీ సెట్ 2024 అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన కొనసాగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రమాకాంత్ తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈఏపీసీఈటీ ర్యాంక్ కార్డు హాల్‌టికెట్, పదోతరగతి, ఇంటర్ మెమో, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, ఆదాయ సర్టిఫికెట్, టీసీ, ఆధార్‌కార్డులతో హాజరుకావాలన్నారు. పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ నెల 15లోగా వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని సూచించారు. ఆదివారం 400మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైనట్లు తెలిపారు. వెరిఫికేషన్ అధికారులు డాక్టర్ రవి, డాక్టర్ రమేశ్, డాక్టర్ ప్రసాద్, అజయ్‌కుమార్, యాదయ్య, సావిత్రి ఉన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

పెద్దపల్లి టౌన్, జూలై 7: ఎల్ఐసీ ఏజెంట్ విధి నిర్వహణలో మృత్యువాత్య పడడం పట్టణంలో తీవ్ర విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం వృతిరీత్యా ఎల్ఐసీ ఏజెంట్ బీమా పని మీద పెద్దపల్లి నుంచి గుండారం వెళ్తుండగా పెద్దపల్లి– మంథని ఫ్లైవర్ సమీపంలో గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వెల్లుతున్న బూడిద లారీ ఢీకొనడంతో కాసంగోట్టు వేణు తీవ్ర గాయాలపాలయ్యాడని పేర్కొన్నారు. తీవ్ర గాయాలైన వేణును చికిత్స కోసం పెద్దపల్లికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. వేణు చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. భార్య లావణ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. మృతునికి భార్య లావణ్యతోపాటు ఇద్దరు కొడుకులు సాయి విఘ్నేష్, అనిష్ ఉన్నారని తెలిపారు. వేణు మృతికి ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం లియాపీ సంఘం ప్రగాడ సంతాపం తెలిపింది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేణు మరణ వార్త పట్టణంలో విషాదం నింపింది.

IN THE COURT OF THE HON'BLE II ADDL.JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI AT:MALKAJGIRI
O.S.No: 338 OF 2023
BETWEEN:
Gurajala Srinivas and another ....Plaintiffs
And
Gurajala Balaraj Goud and others ....Defendants
To,
Defendant No: 5] Manchikatla Satyanarayana, S/o. Late Kistaiah, Aged about 59 years, Occ: Business, R/o. H.No. 5-1-142/A, Krishna Nagar, NTPC, Godavarikani, Karimnagar District.
The abovementioned Plaintiff has filed the present suit for Partition and Separate Possession and Declare the Gift Deed Document No.1677 of 1944 as null and void against the Defendants. As per the orders passed by this Hon'ble court I am issuing this Publication in newspaper to the Defendant No:5 Manchikatla Satyanarayana, in the above Suit. Hence You are hereby required to appear before this Hon'ble Court on 07-08-2024 at 10.30A.M. either in person or through an Advocate, duly instructed by you, failing which the matter will be decided on merits, by setting you exparte.
// By order of the Court //
M/s. P.SRIDHAR, K.LAVANYA
Advocates, 11-13-43, Road No.1
Alakapuri Colony, HYDERABAD
Cell : 9848944637